ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 1 నవంబరు 2025




# పెళ్లింట విషాదం

- రిసెప్షన్‌కు వెళ్లి వస్తుండగా పెళ్లి బృందం జీపును ఢీకొట్టిన లారీ
- ముగ్గురి మృతి, 10 మందికి గాయాలు
- గాయపడిన వారిలో వధువు తల్లిదండ్రులు సైతం...
- వధూవరులు క్షేమం
- భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో ఘటన
- బాధితులు మహబూబాబాద్ జిల్లావాసులు
- క్షతగాత్రులకు ఎంజీఎంలో చికిత్స
- పరామర్శించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

7


స్వప్న(ఫైల్)


శ్రీనాథ్ (ఫైల్)

# పొలాల్లో వరదనీటిని తొలగించాలి

**జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల**



మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల నుంచి వరద నీటిని వెంటవెంటనే తొలగించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల సూచించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. మురుగునీటిని వీలైనంత త్వరగా తీసివేసి నేలవాలినపంటను నిటారుగా నిలబెట్టాలన్నారు. ధాన్యం మొలకెత్తకుండా 5శాతం సోడియం ఫ్లోరైడ్ (సాధారణ ఉప్పు) ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పంటలకు ఎరువులు వేయొద్దని, కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యంను కుప్పగా చేసి టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలన్నారు. నల్లరేగడి నేలలో తేమ ఎక్కువ రోజులు నిలిచి పత్తిచెట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని, వర్షం నీటిని బయటకు పంపించాలన్నారు. ఇప్పటికే తీసి ఉంచిన పత్తిని తడవకుండా (మిగతా 8వ పేజీలో)




పోతననగర్ లో బురదలో నడుస్తున్న సీఎం


అంబేద్కర్ భవన్‌రోడ్ సమ్మయ్యనగర్‌లో నాళాను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# ఓదార్చుతూ.. భరోసానిస్తూ..

**నగరంలోని ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సుడిగాలి పర్యటన**

- మొంథా తుఫాను బాధితులతో మమేకం
- ఏం జరిగిందంటూ ఆరా
- సావధానంగా వారి గోడు ఆలకింపు
- ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ
- గోడు వెళ్లబోసుకున్న పలువురు మహిళలు
- వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తక్షణ సహాయానికి అక్కడిక్కడే ఆదేశాలు
- నగరంలో రెండు గంటల పాటు సాగిన పర్యటన

హనుమకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి శుక్రవారం వరంగల్ నగరంలో సుడిగాలి పర్యటన జరిపారు. మొంథా తుఫాను వల్ల కురిసిన భారీ, అతి భారీ వర్షాలకు వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజల కష్టాలను, నష్టాలను పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. వారితో ముచ్చటించారు. ఆవేదనలు, ఆక్రందనలు, కన్నీటిధారలు, నిస్సహాయత గోడులు, రెండు చేతులు జోడించి ఆదుకొండయ్యా.. అంటూ అర్థింపులు ముఖ్యమంత్రి పర్యటనలో ఆద్యంతం కనిపించిన కన్నీటి దృశ్యాలు. నగరంలోని సమ్మయ్యనగర్, కాపువాడ, పోతననగర్ ప్రాంతాల్లో సీఎం రాకకోసం ఎన్నో గంటల ముందే బాధలతో బరువెక్కిన గుండెలతో ఎదురుచూశారు. వరదతాకిడికి దెబ్బతిన్న తమ ఇళ్ల ముందు వేచి ఉన్న బాధితులు, ముఖ్యంగా మహిళలు సీఎంను చూడగానే ఒక్కసారిగా ఘొల్లుమన్నారు. కన్నీటి పర్యంతం అయ్యారు. సీఎం దగ్గరగా వెళ్లి తమ బాధలను చెప్పుకునేందుకు ప్రయత్నించారు. మరికొంత మంది ఏకంగా కాళ్లమీద పడబోయారు. వారందరినీ రేవంత్ రెడ్డి వారించి పరామర్శించారు. అధైర్యపడకండి.. నేనున్నాను.. మీమ్మల్ని ఆదుకుంటాను.. అని భరోసా ఇచ్చారు.

తొలుత ఏరియల్ సర్వే అనంతరం సీఎం నేరుగా హనుమకొండలోని సమ్మయ్యనగర్ ముంపు ప్రాంతానికి వెళ్లారు. కారులో అక్కడికి చేరుకోగానే అప్పటివరకు ఆతృతతో ఎదురుచూస్తున్న బాధితులు ఆయనను చుట్టుముట్టారు. వరద బీభత్సం వల్ల తాము పడ్డ కష్టాలను ఏకరువు పెట్టారు. సీఎం ఆ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లను, కూలిపోయిన ఇళ్లను చూశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఇద్దరు వరద బాధితులు ఇళ్లలోకి వెళ్లారు. సలేంద్ర రమాదేవి ఇంటిలోకి వెళ్లి ఇంటి పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారు. ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు.. 'అయ్యా... కుండపోతగా కురిసిన వర్షానికి తన ఇంట్లో వరదనీరు చొచ్చుకువచ్చిది.. సామానులన్నీ తడిసిపోయాయి. కొన్ని వస్తువులు వరదల్లో కొట్టుకుపోయాయి. రాత్రంత జాగరణ చేశాం. తినడానికి తిండి, తాగడానికి మంచి నీళ్ల లేక విలవిలాడిపోయాం.' అంటూ ఆ మహిళ కన్నీటితో బాధనంతా చెప్పుకొచ్చింది. 'ఏడ్వకమ్మా.. నీకు తప్పక సాయం అందుతుంది. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తా..' అని సీఎం హామీ ఇచ్చారు. ఆ తర్వాత పక్కనే ఉన్న డబ్బాల లత అనే మరో మహిళ ఇంట్లోకి వెళ్లి చూడగా ఆ ఇంట్లో ఇంకా వరద నీరు నిలిచి ఉండడంతో చలించిపోయారు. సీఎంను చూడగానే ఆ మహిళ బోరున విలపించింది. వరదలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామంటూ గోడు వెళ్లబోసుకున్నది. వరదనీరు ఇంటిలోకి చొచ్చుకురావడంతో తన రేకుల ఇళ్లు కూలిపోయేట్టు ఉన్నదని ఇంటి స్వరూపాన్ని చూపించింది. ఆమె ఆవేదనను విన్న సీఎం.. బాధపడకమ్మా.. తప్పక ఆదుకుంటాం.. ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వ సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కాగా, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇంత వరద బీభత్సం జరిగినట్టు స్థానికులు సీఎంకు ఫిర్యాదు చేశారు. గోపాల్‌పూర్ చెరువు టన్నెల్ గేట్లను ఎత్తివేయడంలో ఐబీ అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల చెరువు పొంగి వరదనీరు (మిగతా 7వ పేజీలో)


సమ్మయ్య నగర్‌లో వృద్ధురాలుతో మాట్లాడుతున్న సీఎం

## జెట్ స్పీడ్‌తో సాగిన పర్యటన

**మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నగరంలో గడిపిన సీఎం**

వరంగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన గంట ఆలస్యంగా మొదలైంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.15 గంటలకు ఏరియల్ సర్వే నిర్వహించాల్సి ఉండగా, మధ్యాహ్నం 2.20గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి 20 నిమిషాలు హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు వరంగల్ నగరాన్ని, పరిసర ప్రాంతాలను హెలికాప్టర్ నుంచే పరిశీలించారు. మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీకి చేరుకున్న సీఎంకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా హనుమకొండ సమ్మయ్య నగర్‌లో వరద ముంపుకు గురైన ప్రాంతాలను సందర్శించారు. మధ్యాహ్నం 3.35 గంటలకు కాపువాడలో పర్యటించి వరద ముంపు బాధితులను పరామర్శించి వారి నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పక్కనే ఉన్న పోతననగర్ ప్రాంతాన్ని, పోతననగర్ నాలాలను పరిశీలించారు. ముంపుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 4.18 గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

అక్కడి నుంచి కలెక్టరేట్ లోపలికి వెళ్లిన సీఎం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం 4.25 గంటల నుంచి 5.15గంటల వరకు ఏడు జిల్లాల కలెక్టర్లతో వరద నష్టాలపై సమీక్షించారు. అధికారుల నిర్లక్ష్యంపై సున్నితంగా హెచ్చరిస్తూనే.. ప్రజలకు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. వరద బాధితులకు భరోసా ఇస్తూ ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సాయంత్రం 5.32గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణం అయ్యారు.

## బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో ఒకరికి 25 ఏళ్ల జైలు

- పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎండీ అబ్దుల్ రఫీ తీర్పు వెల్లడి

8

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్**

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌తో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. తుపాన్‌తో కోతకు గురైన రోడ్లు, కూలిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావంతో పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆందోళన చెంద వద్దని నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని చెప్పారు. ప్రజా భద్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**కూరగాయల మార్కెట్ ప్రారంభం..**

మానుకోట జిల్లా కేంద్రంలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన మోడల్ మార్కెట్‌లో పనులు పూర్తి చేసి కూరగాయల వ్యాపారులకు షాపులు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ కొనసాగుతున్న గాంధీ పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ రాజేశ్వర్, ఏవో తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఖలీల్ పాషా, నీరుటి లక్ష్మీనారాయణ, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, రామగోని రాజు, ఎడ్ల రమేష్, పోతు రాజు, నీరుటి సురేష్‌నాయుడు, శంతన్ రామరాజు, బోళ్ల రాజు, బోనగిరి గిరిధర్‌గుప్తా, శ్యాం రావు, సిరిపురం వీరన్న, విజయలక్ష్మి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, వెంకట్రాములు, సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

**ఇందిరాగాంధీ వర్ధంతి..**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రధానిగా దేశ అభివృద్ధి కోసం సేవ చేయడంతో పాటు ప్రపంచ దేశాలకు దీటుగా భారత్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన మహానేత ఇందిరాగాంధీ అని కొనియాడారు.

# బతికున్న వ్యక్తి మార్చురీకి తరలింపుపై వైద్యశాఖ సీరియస్

- ముగ్గురు అధికారులతో విచారణకు ఆదేశించిన డీఎంఈ
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక రూపొందిస్తున్న బృందం
- జిల్లా ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

నెహ్రూసెంటర్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన వ్యక్తికి ఆధార్ లేదని నిరాకరించిన సిబ్బంది.. ఆపై బతికిఉండగానే మార్చురీకి తరలించిన ఘటనను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ సీరియస్‌గా తీసుకుంది. ముగ్గురు అధికారులతో విచారణకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశించింది. ములుగు జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, జనగామ మెడికల్ కళాశాల సర్జరీ ప్రొఫెసర్ గోపాల్‌రావు, సిద్దిపేట మెడికల్ కళాశాల ఫొరెన్సిక్ మెడిసన్ ప్రొఫెసర్ శ్రీధర్‌లను బృందంగా ఏర్పాటు చేసి, విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ ముగ్గురు అధికారుల బృందం శుక్రవారం మానుకోట జిల్లా ఆస్పత్రిలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికను రూపొందించారు. వివిధ కోణాల్లో వివరాలను సేకరించారు. వ్యక్తి బతికి ఉండగానే నిర్ధారణ చేయకుండా మార్చురీలో ఎలా పెట్టారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా! లేదా? అని అడిగారు. ఆస్పత్రిలో ఏ ఒక్క సీసీ కెమెరా పనిచేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విచారణ చేపట్టిన బృందాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. ఘటనపై వివరాలు సేకరించి నివేదిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. తయారు చేసిన నివేదికను డీఎంఈకి అందించనున్నట్లు వివరించారు. ఘటనకు కారకులైన బాధ్యులపై డీఎంఈ చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.


మహబూబాబాద్ మార్చురీలో వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

**ప్రభుత్వానికి చెడ్డపేరు తేస్తే ఉపేక్షించేది లేదు..**

**మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్**

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మానవత్వాన్ని మసికబార్చే విధంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తే ఎంతటివారైన ఉపేక్షించేది లేదని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పటల్లో బతికుండగానే మార్చురీకి తరలించిన బాధితుడు ఎల్డి రాజు ఐసీలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఆస్పత్రికి వచ్చారు. బాధితుడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యక్తి ప్రాణాలతో ఉన్నప్పటికి వైద్య సిబ్బంది అతడికి వైద్య పరీక్షలు చేయకుండా మృతి చెంది ఉంటాడని, నిర్లక్ష్యంగా మార్చురీకి ఎలా తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వైద్యం కోసం ఎంతో కృషి చేస్తున్నా కొంతమంది నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వాన్ని బదనం చేయడం సరికాదన్నారు. వైద్య సేవలపై ప్రజల నమ్మకాన్ని పెంచాలని సూచించారు. ఇలాంటి నిర్లక్ష్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి




మాట్లాడుతున్న జిల్లా ఐద్వా కమిటీ అధ్యక్షురాలు కవిత

మరిపెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లను భారత ప్రభుత్వం తొమ్మిదోవ షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు 42శాతం రిజర్వేషన్లను వర్తింపచేయాలని జిల్లా ఐద్వా కమిటీ అధ్యక్షురాలు కందునూరి కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలో ఐద్వా మండల కమిటీ సమావేశం దొంతు మమత అధ్యక్షతన జరుగగా ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కుల రక్షణ కోసం ఐద్వా సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. ఊరూరా ఉన్న మహిళలు ఐద్వా సంఘ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పుల్లూరి పద్మ, ఎల్లమ్మ, శైలజ, జిన్నా మాధవి, రాజమ్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై వీరభద్రరావుకు సత్కారం



మరిపెడ ఎస్సై వీరభద్రరావును సత్కరిస్తున్న బీజేపీ నేతలు

మరిపెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మరిపెడ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వీరభద్రరావును మరిపెడ మండల బీజేపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. రాజకీయాలకు అతీతంగా పని చేస్తూ ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై వారితో మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరు సమానులేనని గుర్తు చేశారు. శాంతి భద్రతలకు సహకరించాలని వారిని కోరారు. ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో స్థానిక బీజేపీ నేతలు బింగీ రమేశ్, గంగాధర జనార్దన్, సుధాకర్, పులి శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సత్యవతి జన్మదినం సందర్భంగా పూజలు



మరిపెడ ఎస్సై వీరభద్రరావును సత్కరిస్తున్న బీజేపీ నేతలు

మరిపెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ జన్మదినం సందర్భంగా మరిపెడ బీఆర్ఎస్ నేతలు కొందరు శుక్రవారం మరిపెడ రాములోరి గుడిలో పూజలు చేసి కేక్ కట్ చేశారు. సత్యవతి నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుడిని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి వేణుగోపాల్‌రెడ్డి, భద్రునాయక్, దిలీప్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## మేకల అపహరణ

డోర్నకల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని గొల్లబజారుకు చెందిన జాల వెంకయ్యకు అనే రైతు మేకలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. రెండు మేకపోతులు, ఐదు మేకలను అపహరించుకుపోయినట్లు రైతు వెంక య్య తెలిపారు. అపహరణకు గురైన మేకల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపారు.



# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● పంటలు పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



వెల్లికట్టెలో తడిసిన వరిపంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తొర్రూరురూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షానికి నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం టీఆర్ఎస్ నాయకులు పరిశీలించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందేసమయంలో నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధికంగా వరి, పత్తి పంటలు సాగు చేసిన రైతులు నష్టపోయారని వారికి ప్రభుత్వం ఎకరాకు రూ25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, కాలు నాయక్, జాటోత్ రమేశ్, బాలకృష్ణ, గుగులోత్ రమేశ్, యర్రం రాజు, సంతోశ్, అనిల్‌గుప్తా, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాస్‌లైన్ నాయకులు

## అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలి

తొర్రూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : భారత విప్ల వోద్యమంలో అమూల్యమైన ప్రాణాలర్పించి విప్లవంలో ఎదురు నిలిచిన విప్లవ వీరుల సంస్మరణ సభలను నిర్వహించుకోవాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. శుక్రవారం సంస్మరణ సభల గోడ పత్రికలు ఆవిష్కరించి మాట్లా డారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులను వలసలను నివారించ డానికి ప్రజాస్వామ్య విప్లవ లక్ష్యం గా సాగిన పోరాటంలో అమూల్యమైన ప్రాణత్యాగాలు చేసిన వీరులను స్మరించుకోవాలన్నారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు సంస్మరణ సభలను నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, యాకయ్య, వెంకన్న, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

## పంట నష్టంపై అధికారుల పరిశీలన



జయ్యారంలో నష్టపోయిన వరిని పరిశీలిస్తున్న ఎంఏవో భాస్కర్

చిన్నగూడూరు (మరిపెడ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండలం ఉమ్మడి జయ్యారం జీపీ పరిధిలోని గ్రామాల్లో తుఫాన్‌తో నష్టపోయిన వరి, పత్తి, మిర్చి పంటలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఆయా గ్రామాల ఏఈవోలతో కలిసి పరిశీలించారు. వాస్తవంగా నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఏవో భాస్కర్ స్థానిక విలేకరులకు తెలిపారు. ఆయన వెంట జయ్యారం ఏఈవో సరిత, ఆ గ్రామ రైతులు ఉన్నారు.

## మరియమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

మరిపెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మరియమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని మరిపెడ పరిష్కక్రీస్తురాజు చర్చి ఫాదర్ సురేశ్ అన్నారు. శుక్రవారం పవిత్ర అక్టోబరు నెలను జపమాల తల్లి మరియమ్మకు అంకితంచేస్తూ ఆ సంఘం ఆధ్వర్యాన మరిపెడబంగ్లాలో శాంతి ర్యాలీ నిర్వహించి ఆయన స్థానిక చర్చిలో క్రైస్తవ భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మానవ రక్షణకై మరియమ్మ ఎల్లప్పుడూ క్రీస్తును ప్రార్థిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సేయింట్ ఆగస్టీన్ స్కూల్ సిస్టర్స్, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



పటేల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో భారత ఏకీకరణ శిల్పి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఇల్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చిన గొప్ప నేతలని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహనీయుల ఆశయ సాధనకై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటాచారి, రవి, మధు, రమేష్ నాయక్, అచ్చిరెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో టూకే రన్



టూకే రన్ ప్రారంభిస్తున్న డీఎస్పీ కృష్ణకిషోర్

తొర్రూరు, అక్టోబరు 31 (అంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని తొర్రూరు పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి హైస్కూల్ వరకు యూనిటీ టూకే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ యూనిటీ రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు తదితర ఎన్‌జీవోలతో టూకే రన్ నిర్వహించారన్నారు. ప్రజలంతా ఒకేతాటిపై ఉంటూ దేశభక్తిని పెంపొందించుకుని దేశం ఏక్తా స్ఫూర్తిని బలపర్చుకోవడం నిదర్శనం అన్నారు. పట్టణంలో జరిగిన టూకే రన్ ర్యాలీని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ గణేశ్, ఎస్సైలు ఉపేందర్, రాజు, ప్రమోద్, అంజమ్మ, పోలీసులు, రామగిరి భాస్కరాచారి, సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి ఉన్నారు.

## ఆకేరు వాగులో అక్రమ ఇసుక రవాణా



కస్నాతండా ఆకేరు వాగు నుంచి ఇసుక తోడుతున్న దృశ్యం

తొర్రూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంఠాయపాలెం గ్రామ శివారులోని కస్నాతండా సమీపం నుంచి ఉధృతంగా ప్రవహిస్తు న్న ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. వాగులు ఉధృతంగా ప్రవస్తున్నా ఇసుకరవాణా మాత్రం ఆగడం లేదు. ప్రవహించే వాగులోకి వెళ్లి నీటిలో ముగిని ఇసుక తీస్తున్నారు. అధికారుల సహకారంతోనే ధనార్జనే లక్ష్యంగా ఇసుక రవాణ చేస్తున్నారని, ఉధృతి పెరిగితే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. ఈ విషయంపై ఆర్.ఐ నజీముద్దీన్ వివరణ కోరగా స్థానిక ప్రజలకు, ఇసుక ట్రాక్టర్ యజమానులకు అవగాన కలిపించినట్లు తెలిపారు.

## హోరెత్తిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్పస్వాములకు అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

మరిపెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బంగ్లాలోని అయ్యప్పస్వామి-భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్ష స్వాములు శుక్రవారం భజనలు, నగర సంకీర్తనలతో హోరెత్తించారు. ఆ ఆలయ అర్చకులు బుక్క మఠం నవీన్ దేవతమూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు.

# ఇందిరా గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలి

**వర్ధంతి సభలో నాయకుల పిలుపు**



బయ్యారంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

బయ్యారం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం బయ్యారం, గంధంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. బయ్యారం రామాలయం సెంటర్‌లోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మూల మధుకర్ రెడ్డి మాట్లాడారు. ఇందిరా గాంధీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆమె చూపించిన మార్గదర్శమే నేడు దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. సమాజంలో సమానత్వం, మహిళా సాధికారతకు మార్గదర్శకురాలిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌నాయక్, కిషన్‌నాయక్, ముసలయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనినివాస్, సీతారాం రెడ్డి, వీరారెడ్డి, రమేష్, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, సుమన్, నర్సయ్య, ఉపేందర్, రవి, లక్ష్మీ, వీరన్న పాల్గొన్నారు.

**డోర్నకల్ :** డోర్నకల్‌లో ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించారు. ఇంద్రనగర్‌లోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్ మాట్లాడారు. ఇందిరాగాంధీ దేశ ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తారాచంద్, తాళ్లూరి హనుమ, మాద శ్రీనివాస్, ప్రవీన్, ఎస్.వెంకటేశ్వర్లు, దాసరి నాని, స్వామి, రెడ్డబోయిన శంకర్, వీరభద్రం, ప్రవీన్‌కుమార్, దోసపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గార్ల :** గార్లలోని ఇందిరానగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణగౌడ్, జాతీయ శ్రీశక్తి అవార్డు గ్రహిత షంషాద్ బేగం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, పల్లా నర్సయ్య, హాతీ రాంనాయక్, యాకుబ్‌పాష, కళావతి, జహర్‌లాల్, పృథ్వీనాయక్, జహంగీర్ పాల్గొన్నారు.



డోర్నకల్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గార్లలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్యకర్తలు

# బాధిత రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

కురవి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ బీభత్సంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆత్మ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంట దెబ్బతిన్న పలు గ్రామాల్లో శుక్రవారం సీపీఐ బృందం పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిపంట చేతికి అందే దశలో తుపాన్‌తో పంట మొత్తం నేలకు ఒరిగిందన్నారు. పత్తిపంట రంగుమారి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, తురక రమేష్, కలగూర నాగరాజు, అప్పాల వెంకన్న, బొల్లం అనిల్ పాల్గొన్నారు.

### ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కురవిలో సంఘ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐటీయూసీ కార్మిక సంఘం కార్మిక చట్టాల రూపకల్పన సహా అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బొల్లం ఉప్పలయ్య, కర్నం రాజన్న, తురక రమేష్, కలగూర నాగరాజు, అప్పాల వెంకన్న, బొల్లం అనిల్, ఉదయ్, బాలాజీ, చందు, ప్రవీన్ పాల్గొన్నారు.



వీరభద్రస్వామి దేవాలయంలో అన్నదానం చేస్తున్న ఆంగోతు బిందు

## ఘనంగా సత్యవతిరాథోడ్ జన్మదినం

కురవి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి సత్యవతిరాథోడ్ జన్మదిన వేడుకలను శుక్రవారం కురవిలో ఘనంగా నిర్వహించారు. వీరభద్రస్వామి దేవాలయంలో ఆమె పేరిట అర్చన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు ఆధ్వర్యంలో స్వాములకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐలు నరహరి, బండ బిక్షంరెడ్డి, నూతక్కి నర్సింహారావు, బోడ శ్రీను, నెహ్రూనాయక్, బాదె నాగయ్య, అల్లూరి కిశోర్‌వర్మ, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మన్యుపాట్నీ, బోజ్యానాయక్, భద్రు, జీవన్, అర్జున్‌చౌహాన్, బాదావత్ చంటి, వినోద, గండి వీరేందర్, వెంకట్, ఐజేయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పొలాలను ముంచెత్తిన మున్నేరు



మున్నేరులో మునిగిన వరిపొలం

డోర్నకల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యాలవాడ రెవెన్యూ పరిధిలో మున్నేరు వరద పంట పొలాలను ముంచెత్తింది. తుపాన్ ప్రభావంతో మున్నేరుకు భారీగా వరద రావడంతో వరి పొలాల మీదుగా వెళ్లింది. వరద నీటితో ఆరుగాలం కష్టపడి పండించిన కొంత వరి పంట చేతికొచ్చే సమయంలో కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన నున్న మల్లికార్జున్ పొలం మూడు రోజులుగా మున్నేరు వరద నీటిలోనే ఉండడంతో పంట చేతికి రాకుండా ఉండడంతో కోతకు సిద్ధంగా ఉన్న పంట వరదపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మున్నేరు వరదకు నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

## దీక్షా శిబిరం టెంట్ ధ్వంసం

బయ్యారం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దీక్షా శిబిరానికి చెందిన టెంట్ ధ్వంసమవడం రాజకీయ వర్గాల్లో కలకలంరేపుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి తనపై జరిగిన హత్యాప్రయత్నానికి సంబంధించిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజులుగా అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం నాలుగోరోజు దీక్ష ముగిసిన అనంతరం శ్రీనివాస్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం శుక్రవారం ఉదయం ఐదోవ రోజు దీక్ష చేపట్టేందుకు ఆయన దీక్షా శిబిరం వద్దకు రాగా, టెంట్ చినిగిపోయి ధ్వంసమై కనిపించింది. దీంతో శ్రీనివాస్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెంట్ ధ్వంసానికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులను విచారణ ద్వారా గుర్తించి, తగు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. కాగా, టెంట్ ధ్వంసం చేయడంతో శుక్రవారం ఐదోరోజు ఆరుబయటే తన దీక్షను కొనసాగించగా, పలువురు మద్దతుగా సంఘీభావం తెలిపారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు

గార్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పినిరెడ్డి గూడెం సమీపంలో కాకతీయుల కాలంలో నిర్మించిన కొండలమ్మ దేవాలయంలో గురువారం రాత్రి ఏడుగురు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. స్థానికంగా ఉన్న రైతులు గ్రామస్థులకు తెలుపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పోలీసులు ఐదుగురు నిందితులను పట్టుకోగా, మరో ఇద్దరు పారిపోయారు. ఆలయ కమిటీ చైర్మన్ బూర్ల మల్లేశ్ ఫిర్యాదు మేరకు వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి




పినిరెడ్డిగూడెంలో ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

గార్ల, అక్టోబరు 31 (అంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీపీఎం మండల నాయకుడు వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గార్ల మండలం పినిరెడ్డిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి వంగూరి కొండయ్య, కేలోత్ బాలనాయక్, వి.రాంజీ, ఎల్లమ్మ, ఎం.లక్ష్మి, నాగమణి, ఆరోగ్యం, చంద్రమ్మ, ద్వాలీ పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో సీఎం పర్యటన

వరంగల్ టౌన్/మామునూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 11వ డివిజన్‌లో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు జలమయమయ్యాయి. కాలనీలలోని ఇళ్లలోకి వరద నీరు భారీగా రావడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. భారీ స్థాయిలో ఆస్తి నష్టం జరిగింది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నగరంలో పర్యటించారు. 11వ డివిజన్ కాపువాడలో ముంపు బాధితులను పరామర్శించి వారి నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.


హనుమకొండలోని సమ్మయ్యనగర్ నుంచి నయీంనగర్‌కు వెళ్లే నాలాను పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

### పోతననగర్‌లో..

మట్టెవాడ: వరద ముంపునకు గురైన పోతననగర్ ప్రాంతాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. అయితే కేవలం 4 నిమిషాలల్లో సీఎం పర్యటన ముగియడంతో ప్రజలు తీవ్రనిరాశ చెందారు. సీఎం వెంట ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్ పాయ్, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా అధికార యంత్రాంగం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మిసురేందర్ పాల్గొన్నారు.

### కార్పొరేటర్ వినతి..

వరంగల్ పోతననగర్ నాలాను విస్తరించాలని 11వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్ సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. వరంగల్ పోతననగర్ భద్రకాళి చెరువు మత్తడిని అభివృద్ధి చేయాలని, భద్రకాళి నాళాలను విస్తరించి ఎల్‌బీ కళాశాల వద్ద కల్వర్టు ఎత్తు పెంచాలని, భద్రకాళి ఆలయానికి వెళ్లే దారిలో రంగంపేట వద్ద వంతెనను విస్తరించి ఎత్తు పెంచాలని, వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి పత్రంలో కోరారు. బొందివాగు నాళా వరదనీటిని భద్రకాళి చెరువులోకి మళ్లించాలని కోరారు.


వరంగల్ పోతననగర్‌లో వరద ముంపును సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తున్న కలెక్టర్ సత్యశారద

### సమ్మయ్యనగర్‌లో వినతిపత్రాల స్వీకరణ

హనుమకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హనుమకొండలోని సమ్మయ్యనగర్‌తోపాటు పలు కాలనీలను సందర్శించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు అధికారులతో కలిసి సీఎం పర్యటించారు. బాధితులను కలిసి మాట్లాడారు. భారీ వర్షాలతో చెరువులు తెగిపోయి రోడ్లు, కాలువలు, ఆస్తి నష్టం జరిగిందని పలువురు కాలనీల వాసులు సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకొచ్చారు. సమ్మయ్య నగర్ కాలనీకి చెందిన సలేంద్ర రమాదేవి, డబ్బాల లత నివాసాలకు సీఎం చేరుకొని వరద నష్టంపై వారితో మాట్లాడారు. వారి నుంచి వినతి పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి స్వీకరించి నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాలనీలలో ఉన్న ముంపునకు గురైన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని కలెక్టర్‌ను ఆదేశించారు. సమ్మయ్యనగర్ నాలాను పరిశీలించి వరద ప్రభావాన్ని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్, మున్సిపాల్ కమిషనర్ చాహత్‌బాజ్ పాయ్ అడిగి తెలుసుకున్నారు. ఏటా వర్షాకాలంలో తాము వరద ముంపునకు గురవుతున్నామని, తమను ఆదుకోవాలని బాధితులు సీఎంను వేడుకున్నారు.


సమ్మయ్యనగర్‌లో చిన్నారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

### మున్సిపల్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తా..

వరద ముంపు ప్రాంతాలను సమ్మయ్య నగర్ నాలాను పరిశీలించి వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని జీడబ్ల్యూఎంసీ కార్మికులు సీఎం ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. అక్కడే ఉన్న కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, సీఎం ప్రత్యేక సలహాదారుడు వేం నరేందుగర మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంజనీర్స్ కాలనీలో సీఎం పర్యటన

వడ్డెపల్లి(ఆంధ్రజ్యోతి): వరద తాకిడికి గురైన హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌లోని ఇంజనీర్స్ కాలనీ రోడ్డు నంబర్-2 ను సీఎం రేవంత్‌రెడ్డి... రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. ఇంజనీర్స్ కాలనీలో వరద బీభత్సానికి గురైన బాధితులను కలిసి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వరద బాధితులు లత, అరుణ, అనిత, వాంకుడోత్ వీరన్న తదితరులు సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. తుఫాన్‌వల్ల తాము సర్వం కోల్పోయామని పేర్కొన్నారు. తాము నివాసం ఉంటున్న స్థలానికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ పథకం కింద గృహాలు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నారు. సమ్మయ్యనగర్‌లోని నాలాలను పరిశీలించారు. కాగా, సమ్మయ్యనగర్‌లోని ఇంజనీర్స్ కాలనీలో సీఎం పర్యటన 28 నిమిషాలపాటే కొనసాగింది.

## ఓదార్చుతూ.. భరోసానిస్తూ...

(5వ పేజీ తరువాయి)

తమ ఇళ్లలోకి చొచ్చుకువచ్చిందని ఫిర్యాదు చేశారు. ఆతర్వాత సీఎం అక్కడి నుంచి కాపువాడకు చేరుకున్నారు. ఇక్కడ కొద్ది సేపే ఉన్నారు. వరదలకు దెబ్బతిన్న రోడ్లు, ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. సీఎం రాగానే బాధితులంతా ఒక్కసారిగా ముందుకు చొచ్చుకువచ్చి తమ గోడు వినిపించే ప్రయత్నం చేశారు. ఇక్కడ కూడా రేవంత్ రెడ్డి ఒకరిద్దరితో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఒక మహిళ వరదల వల్ల జరిగిన నష్టాన్ని వివరించగా బాధపడకమ్మా.. సాయం తప్పక అందుతుందని వారించారు. అ తర్వాత సీఎం అక్కడి నుంచి పోతననగర్‌కు చేరుకున్నారు. సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఇరుకు వీధిలోకి వెళ్లి బాధితులను కలుసుకున్నారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో వరద ముంపునకు గల కారణాలను తెలుసుకునేందుకు మ్యాప్‌లను పరిశీలించారు. రంగంపేటకు కూడా సీఎం వెళ్లాల్సి ఉన్నప్పటికీ ఆ వెంటనే సీఎం హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చేశారు.

### తూర్పు వైపు వెళ్లలేదు...

సీఎం పర్యటన అంతా ఎమ్మెల్యే నాయిని రాజేందరెడ్డి ప్రాతినిథ్యం వహించే వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రాంతాల్లోనే సాగింది. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గమైన వరంగల్ తూర్పులో కూడా వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. నిజానికి పశ్చిమలో కన్నా తూర్పులోనే వర్షం అధికంతా పడడటమే కాకుండా అనేక ప్రాంతాలు నీట మునిగాయి. నష్టం కూడా ఎక్కువగానే జరిగింది. అయినా కూడా సీఎం తూర్పు ప్రాంతాల్లో పర్యటించకపోవడం గమనార్హం. మొత్తం మీద సీఎం నగరంలో రెండు గంటల పాటు గడిపారు.


హనుమకొండ కలెక్టరేట్‌లో ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు


వరంగల్ పోతననగర్‌లో వినతి పత్రం తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి


హనుమకొండలోని సమ్మయ్యనగర్‌లో నాలాను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


హనుమకొండ కలెక్టరేట్‌లో రివ్యూలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పాల్గొన్న మంత్రులు


హనుమకొండ కాపువాడలో సీఎంకు వరద గురించి వివరిస్తున్న ప్రజలు


సమ్మయ్యనగర్‌లో సీఎంకు సమస్యలను వివరిస్తున్న కలెక్టర్

## గల్లంతైన శ్రావ్య మృతదేహం లభ్యం

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే
- అన్నివిధాలా ఆదుకుంటామని హామీ

జఫర్‌గఢ్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వాగులో గల్లంతైన బక్క శ్రావ్య శుక్రవారం శవమై కనిపించింది. బుధవారంరాత్రి జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కోనాయిచలం శివారు బోళ్లమత్తడి వద్ద వాగులో ప్రేమజంట కొట్టుకుపోగా శ్రావ్య గల్లంతు కాగా, యువకుడు బరిగెల శివకుమార్ ప్రాణాలతో బయటపడిన విషయం విదితమే. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శుక్రవారం వాగులో గాలిస్తుండగా ఘటన జరిగిన సమీపంలోనే శవమై కనిపించింది. విగతజీవిగా పడి ఉన్న కుమార్తె మృతదేహం చూడగానే తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కూతురు మరణానికి కారకుడైన శివకుమార్‌ను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఆస్పత్రికి తరలించి, శావ్య తల్లి పూర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.


వాగులో లభ్యమైన శ్రావ్య మృతదేహం

### శ్రావ్య కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే

బక్క శ్రావ్య కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధితులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన అధికారులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో బోళ్లమత్తడి ప్రదేశాన్ని పరిశీలించారు. శ్రావ్య తల్లిదండ్రులు ఆలీసాబ్-పూర్ణ, వారి కుటుంబీకులను పరామర్శించారు. కడియం మాట్లాడుతూ యువతి మృతిపై సమగ్ర విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా బాధితులకు అందించే రూ.5 లక్షల ఆర్థిక సాయం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్‌రెడ్డి, ఎంపీడీవో సుమన్, ఇరిగేషన్ ఈఈ సీతారాం నాయక్, పీఆర్ ఏఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, ఆర్.సుదర్శన్ పాల్గొన్నారు.

### రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి : బీజేపీ

శ్రావ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు.


శ్రావ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

## పెళ్లి బృందం జీపును ఢీకొట్టిన లారీ

- ముగ్గురి మృతి, పలువురికి గాయాలు
- వధువు తల్లిదండ్రులకు సైతం గాయాలు
- భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో ఘటన
- బాధితులు మహబూబాబాద్ జిల్లావాసులు
- క్షతగాత్రులకు ఎంజీఎంలో చికిత్స
- పరామర్శించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో స్వప్న, కళమ్మ, శ్రీనాథ్‌ల మృతదేహాలు


ఎంజీఎం మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

భీమదేవరపల్లి(ఎల్కతుర్తి), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లింట విషాదం నెలకొంది. వరుడి ఇంట్లో రిసెప్షన్ ముగించుకొని వధూవరులతో వస్తున్న వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వధువు బంధువులు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన కాచిపడగల కులస్థులు ముదిరాజుల కథలు చెబుతూ.. యాచిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఇదే కాచిపడగల కులస్థుడైన ఉస్తం రాజు చిన్న కుమార్తె నాగలక్ష్మి వివాహం ఈనెల 29న(బుధవారం) కురవి వీరభద్రస్వామి దేవస్థానంలో సిద్దిపేట జిల్లా వెంకటాపూర్‌కు చెందిన వరుడు భాస్కర్‌తో జరిగింది. మరుసటి రోజు 30న పెళ్లి కుమారుడి ఇంటికి వధువు కుటుంబ సభ్యులు, బంధువులు రిసెప్షన్ కోసం వ్యాన్‌లో వెంకటాపూర్ గ్రామానికి వెళ్లారు. రాత్రి రిసెప్షన్ అనంతరం తిరిగి సూదనపల్లికి వధూవరులను తీసుకుని అర్ధరాత్రి బయలుదేరారు. మార్గమధ్యలోని భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద మూత్ర విసర్జన కోసం వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపారు. ఈ క్రమంలో అతివేగంగా బోర్‌వెల్ లారీ పెళ్లి వ్యాన్‌ను బలంగా వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో వాహనంలో ఉన్న సూదనపల్లికి చెందిన వధువు బంధువులు రెడ్డబోయిన స్వప్న(16), శ్రీనాథ్(6), కళమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే అనసూయ, అక్షయ, మారుతి, రమాదేవి, దేవేందర్, నవలోక్, రిత్విక్, సరోజన, కార్తీక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యుడు రెడ్డబోయిన శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

### బాధితులకు ఎంజీఎంలో చికిత్స

వరంగల్ మెడికల్(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోగా, గాయపడిన వారిని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చారు. మొత్తం 20 మందిని ఎంజీఎంకు తీసుకురాగా, వారిలో 10 మందికి స్వల్ప గాయాలు, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఎంజీఎంలో అనసూర్య(65), శివకుమార్(7), అక్షిత(8), సంజన అనే చిన్నారులతోపాటు మారుతి అనే వ్యక్తి చికిత్స పొందుతున్నారు. చిన్నారుల తలలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇందులో మరో ఐదుగురు క్షతగాత్రులు ములుగురోడ్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, క్షతగాత్రులను పోలీసు కమిషనర్ పరామర్శించారు. ఘటన వివరాలు తెలుసుకొన్నారు. ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఇదిలావుండగా, ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, మిత్రులు ఎంజీఎం క్యాజువాలిటీ గేటు చేరుకునే ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

### సూదనపల్లిలో విషాదం..

కురవి(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆగివున్న బొలేరోను లారీ ఢీకొన్న ఘటనలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లికి చెందిన రెడ్డబోయిన స్వప్న (16), రెడ్డబోయిన శ్రీనాథ్(6)తో పాటు పెళ్లికి వచ్చిన వీరి సమీప బంధువు కొండపర్తి కళమ్మ(55) మృతి చెందడంతో బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదే ఘటనలో బొలేరోలో ఉన్న ఉస్తం రాజుకు రెండు కాళ్లు, నడుం విరిగింది. గంగలక్ష్మికి కాళ్లు, నడుము, ఉస్తం అనసూర్య, శ్రీరాంలకు తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లారు. ఉస్తం భాగ్య, దేవేందర్‌లకు కాళ్లు విరిగాయి. పెళ్లి కూతురు తండ్రి ఉస్తం రాజుకు రెండు కాళ్లు విరగగా, తల్లి ఉస్తం అనసూర్యకు తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. మృతదేహాలు శుక్రవారం అర్ధరాత్రికి స్వగ్రామం చేరుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

## మత్తడితో కనువిందు చేస్తున్న పాకాల

ఖానాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మత్తడి పోస్తూ కనువిందు చేస్తోంది. ఈ ఏడాది ఎన్నడూలేని విధంగా ఆగస్టు 15నుంచి పాకాల సరస్సు మత్తడి పోస్తూనే ఉంది. ఇంత సుదీర్ఘకాలం మత్తడి పోసిన దాఖలాలు గతంలోలేవు. కాగా, పాకాల మత్తడి పోస్తుండడంతో అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కాజ్‌వేపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో అశోక్‌నగర్-కొత్తగూడ గ్రామాలకు రాకపోకలు మూడు రోజులుగా నిలిచిపోయాయి.



# బోధకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

● జిల్లాలో 22 పూర్వప్రాథమిక పాఠశాలల ఎంపిక

● నేటి నుంచి 7 వరకు అప్లికేషన్ల స్వీకరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పూర్వప్రాథమిక పాఠశాలల్లో బోధకులు, ఆయాల నియామకాలను ఈనెల 1వ తేదీ నుంచి 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దక్షిణామూర్తి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 22 పూర్వప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చారని, ప్రతీ స్కూల్‌కు బోధకులు ఒకటి, రెండు ఆయా పోస్టులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉండాలని, బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆయా పోస్టుకు కనీస విద్యార్హత 7వ తరగతి ఉత్తీర్ణత కలిగిఉండాలని, స్థానిక ప్రాంతంలో నివాసం ఉండాలని, స్థానిక గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా వాసులై ఉండాలన్నారు. నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థులు 18 నుంచి 44 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 5 ఏళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు సడలింపు ఉంటుందన్నారు. బోధకులకు నెలకు రూ. 8వేలు, ఆయాకు రూ.6వేలు గౌరవ వేతనం ఉంటుందన్నారు.

మహబూబాబాద్ మండలంలో ఎంపీపీఎస్ జమాండ్లపల్లి, ఎంపీపీఎస్ ఈదులపూసపల్లి, ఎంపీపీఎస్ గడ్డిగూడెం, దంతాలపల్లిలో ఎంపీయూపీఎస్ గున్నెపల్లి, ఎంపీపీఎస్ లక్ష్మీపురం, నెల్లికుదురులో- ఎంపీపీఎస్ మునిగలవీడు, గూడూరులో-ఎంపీపీఎస్‌అయోధ్యాపురం, ఎంపీపీఎస్ లక్ష్మీపురం, తొర్రూరులో- ఎంపీపీఎస్ వెంకట్రాంపురం, ఎంపీపీఎస్ వెలికట్టె, ఎంపీపీఎస్ అమ్మాపురం, సీరోలులో- ఎంపీపీఎస్ కాంపల్లి స్కూళ్లు ఎంపికయ్యాయని డీఈవో తెలిపారు. ఎంపీపీఎస్ తాళ్లసంకీస, నర్సింహులపేటలో-ఎంపీయూపీఎస్ బోడ్కతండా, గార్లలో- ఎంపీపీఎస్ చిన్నకిష్టాపురం, కురవిలో- డీఎన్టీయూపీఎస్ గుండ్రాతిమడుగు స్టేషన్, డీఎన్టీపీఎస్ హరిదాస్‌తండా, కేసముద్రంలో- ఎంపీపీఎస్ కల్వల, ఎంపీపీఎస్ బోడగుట్టతండా, చిన్నగూడూరులో- ఎంపీపీఎస్ జయ్యారం, కొత్తగూడలో-ఎంపీపీఎస్ దొరవారిపల్లి, డోర్నకల్ మండలంలోఎంపీపీఎస్ శాస్త్రీనగర్ పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. ఈ పోస్టులు తాత్కాలికం మాత్రమే అని, విద్యాసంవత్సరంలో 10 నెలలు గౌరవ వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఫొక్సో కేసులో ఒకరికి 25 ఏళ్ల జైలు

కేసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాలికను కిడ్నాప్‌తో పాటు.. ఆమెపై లైంగిక దాడి చేసిన కేసులో కేసముద్రం మండలం కల్వల శివారు గాంధీనగర్ జీపీ పరిధిలోని వెంకట్రాంతండాకు చెందిన భూక్య శ్రీనుకు 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానాను మహబూబాబాద్ ఫోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎండీ అబ్దుల్‌రఫీ విధించినట్లు ఎస్‌ఐ కె.క్రాంతికిరణ్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన ప్రకారం. 2018లో 15 ఏళ్ల బాలికను కిడ్నాప్, లైంగికదాడి చేసిన ఘటనపై బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో భూక్య శ్రీనుపై కేసు నమోదైంది. అప్పటి డీఎస్పీ ఎ.నరేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి విచారించిన అనంతరం నిందితుడు భూక్య శ్రీనును దోషిగా తేలుస్తూ 25 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

ఈ కేసులో నిందితునికి శిక్షపడేలా చేసినందుకు డీఎస్పీ నరేష్‌తో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గణేష్, ఆనంద్, కె.వెంకటయ్య, కోర్టు లైసనింగ్ ఆఫీసర్ ఎస్‌ఐ ఎన్.జీనత్, హెచ్‌సీ టి.దేవానాయక్‌లను జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అభినందించారు.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్**



నెల్లికుదురులో వరిపొలాల్ని పరిశీలిస్తున్న మురళీ నాయక్ ←

నెల్లికుదురు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. మండలంలోని రత్తిరాంతండా, నల్లగుట్టతండా, రామ్మగూడెం, మధనతుర్తి శ్రీరామగిరి, గ్రామాలలో తుపాన్‌వల్ల నష్టపోయిన వరిపొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి ప్రభత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. రైతులు అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద నరేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్ గౌడ్, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి ,బాలాజీనాయక్, ఆకుతోట సతీష్, రావుల సతీష్, రైతులు పాల్గొన్నారు.

### ప్యాడీ డ్రైయ్యర్ ప్రారంభం

● కేసముద్రం : రైతు సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం మార్కెట్ ఆవరణలో రూ.19లక్షలతో ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 25న 'లక్షలు వెచ్చించి..కవర్ కప్పి' శీర్షికన మార్కెట్లో నూతనంగా తీసుకవచ్చిన ప్యాడీ డ్రైయ్యర్ యంత్రం నిరుపయోగంగా మారిందని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత యంత్రం నిపుణులను రప్పించి కొద్దిరోజుల క్రితమే ట్రయల్‌రన్ నిర్వహించారు. తాజాగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని శుభ్రం చేయడమేకాకుండా ఆరబెట్టడం కూడా ఈ యంత్రం చేస్తుండడాన్ని రైతులు ఆసక్తిగా పరిశీలించారు. అంతకు ముందు మార్కెట్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ఎమ్మెల్యే లాంఛనంగా ఆరంభించారు. ఇందిరాగాంధీ వర్ధంతి, వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, గుగులోత్ దస్రూనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో కాంత్రి, ఏవో వెంకన్న, కార్యదర్శి అమలింగేశ్వర్‌రావు, సీహెచ్. వసంతరావు, ఎండీ.అయూబ్‌ఖాన్, కొల్లూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం మునిసిపాలిటీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ మండల కార్యదర్శి మద్రిపెల్లి మొగిలి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తర్వాత అర్పనపల్లి వట్టివాగు వెంటనున్న వడ్డెరకాలనీలో వరద బాధితులకు ఎమ్మెల్యే బియ్యం అందజేశారు.

# 'రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి'



ఇందిరాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి, నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రెవా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, గుగులోతు కిషన్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహం వద్ద మూతికి నల్లగుడ్డ కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పెన్షనర్లకు రావాల్సిన జీఎల్ఐసీ, జీపీఎఫ్, కమిటేషన్, గ్రాట్యూటీ మొదలగు బెనిఫిట్స్ ఒక్కొ పెన్షన్ దారుడికి రూ. 40 నుంచి రూ.50 లక్షలు రావాలని పేర్కొన్నారు. వివిధ అవసరాలకు బ్యాంకుల ద్వారా తీసుకున్న లోన్లకు ఈఎంఐలు కట్టలేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గత కొద్ది రోజుల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించటంలేదన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని, లేని యెడల దశల వారీగా ధర్నాలు, నిరసనలు తెలుపుతూ ఆమరణనిరాహార దీక్షతో ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్దన్, మురళీధరస్వామి, యోగీశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, వీరస్వామి, పద్మావతి, పద్మ, నిరంజన్‌రెడ్డి, అస్మాతార, వెంకన్న, ఇమామ్, దర్గయ్య, విజయ్‌కుమార్, మైసయ్య పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా అండగా నిలుస్తుందని జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లో సిటీ లారీ ట్రాన్స్‌పోర్టు హమాలీ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం 31 అక్టోబరు 1920న ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతుందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, మంద శంకర్, రవి, శ్రావణ్, జక్కరయ్య, పెరుగుకుమార్, లింగ్యా, ప్రవీణ్, అశోక్, చిరంజీవి, సోమయ్య పాల్గొన్నారు.

## 'రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం'

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం బేతోలులోని సాయిశ్రీనివాస కాటన్ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, పూర్తిగా ఎండబెట్టి తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. రైతులు ఎవరు ప్రైవేట్ దళారుల వలలో పడకూడదని సూచించారు. రైతులకు సరైన మద్దతు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, మార్కెట్ కార్యదర్శి సుజన్‌బాబు, సూపర్‌వైజర్ రమేష్, జిన్నింగ్ మిల్లు యాజమాని తల్లాడ కృష్ణమూర్తి, సతీష్, సీసీఐ అధికారి సునీల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

మహబూబాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర మాజీమంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఇంటి ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ అడవులు అంతరించి పోయి పర్యావరణం దెబ్బతింటోందని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించి, భావితరాలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

# క్రీడల్లో మానుకోటను అగ్రస్థానంలో నిలపాలి

● జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో మానుకోట జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర స్థాయిలో బంగారు, సిల్వర్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అక్టోబరు 26న నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా వుషూ ఉమెన్స్ లీగ్-2025 పోటీల్లో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన 22 మంది వుషూ సిస్టర్స్ అకాడమీకి చెందిన విద్యార్థినులు బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించి జిల్లా క్రీడా ఖ్యాతిని చాటారని చెప్పారు. జాహిద్, మాస్టర్స్ అయేషా తస్నీమా, సోహ తబుస్సుం, రమణ, ఉమా, పెరుగుకుమార్, వీరవెళ్లి రవి, మహోన్నవి, జోహో, నిహారిక, జస్సీ, గీత, కీర్తన, లాస్య, ప్రియా, దీప పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

● రూ.2 లక్షలకుపైగా ఆస్తి నష్టం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

కేసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మార్కెట్‌రోడ్డులోని జైభవాని హోటల్ వెనుకనున్న భవనం మొదటి అంతస్తులో శుక్రవారం ఉదయం ఫ్రిడ్జ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం...జిల్లా కలెక్టరేట్ పశువైద్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రోహిత్, ఆయన భార్య ప్రత్యూష ఇనుగుర్తి గురుకులంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ కేసముద్రంలోని చంద్రమౌళి ఇంట్లో మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. ఇరువురు ఉదయం ఇంటికి తాళం వేసి తమ ఊరికి బయలుదేరారు. వారు వెళ్లిన కొద్దిసేపటికే ఇంట్లోంచి దట్టమైన పొగలు రావడంతో రెండో అంతస్తులో ఉన్నవారితో పాటు చుట్టుపక్కల ఉన్నవారు అప్రమత్తమై మోటారుకు పైపు అమర్చి నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఇంట్లో ఫ్రిడ్జ్ షార్ట్ సర్క్యూట్ అయి నిప్పు వెలువడి అగ్నిప్రమాదం సంభవించినట్లు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయి సుమారు రూ.2లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

## నీట మునిగిన పంటలకు నష్టపరిహారం అందించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న




కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌తో నీట మునిగిన, దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 16,377 ఎకరాల వరి పంట, 782 ఎకరాల పత్తి మిర్చి, 565 ఎకరాల మిర్చి తోటలు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాల్లో తేలిందని తెలిపారు. మొంథా తుపాన్ రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, వర్షంతో తడిచిన పంటలను ప్రభుత్వం కొర్రిలు పెట్టకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండా ఐలయ్య,గుజ్జు దేవేందర్, మోకాళ్ల మురళీకృష్ణ, జి.సక్క, యాకన్న, వెంకన్న,భిక్షం, కొమురెల్లి, భిక్షం, చారి హరీష్, ప్రసాద్, రవి, లింగమల్లు పాల్గొన్నారు.

# వరికి ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

● తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న



పత్తి చేనును పరిశీలిస్తున్న తెలంగాణ రైతు సంఘం నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌తో పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు మల్యాల, బేతోలులో వర్షంతో నష్టపోయిన పంటలను శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా గునిగంటి రాజన్న మాట్లాడుతూ తీవ్ర తుఫాన్‌తో పత్తి, వరి, మిరప తోటలు దెబ్బతిన్నాయని దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పోయిన రైతులకు వరికి ఎకరాకు రూ.50 వేలు, పత్తికి రూ.30 వేలు, మిర్చి ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్, దుడ్డెల రాంమూర్తి, రైతులు బొంత వెంకన్న, గోగుల నాగరాజు, రమేష్, వెంకన్న, వీరన్న, భద్రమ్మ, ధనలక్ష్మి, బుజ్జి, కవిత, సంధ్య పాల్గొన్నారు.

## పంటల సర్వే నిర్వహించాలి : సీపీఐ

కేసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపానుతో నష్టపోయిన పంటలను శాస్త్రీయంగా సర్వే నిర్వహించి, రైతులకు పరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కోరారు. మండలంలోని ఉప్పరపల్లి, ధన్నసరిలో శుక్రవారం నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్రం వెంటనే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, సామ సారయ్య, భిక్షపతి, నాగరబోయిన కోటయ్య, జీజు శ్రీనివాస్, చాగంటి గంగయ్య పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి

తుపాను ప్రభావంతో పంటలను రైతులు తీవ్రంగా నష్టపోయారని జైకిసాన్ రైతు సంఘం అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కేసముద్రంలో శుక్రవారం మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## పొలంలోని వరదనీటిని తొలగించాలి

(5వ పేజీ తరువాయి)

చూసుకోవాలని, ఒకవేళ తడిస్తే దూదిరంగు మారి నాణ్యత దెబ్బతింటుందని, దాని నివారణకు ప్రొపికొనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారి చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఆకులపై మచ్చలు ఏర్పడితే బోరాక్స్ 1.50 గ్రాములు లీటర్ నీటికి కలిపి చల్లాలన్నారు. తడి వా తావరణం వల్ల పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందని చెప్పారు. వీటి నివారణకు ఎసిపేట్ 1.50 గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న పంటను వర్షాలు పూర్తిగా తగ్గే వరకు కోయకుండా వాయిదా వేసుకోవాలన్నారు.

### పంట నమోదులో తేడాలుండొద్దు..

● బయ్యారం : పంట నమోదు (క్రాప్ బుకింగ్) వివరాలను సంబంధిత పోర్టల్‌లో సక్రమంగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) విజయ నిర్మల రైతులకు సూచించారు. శుక్రవారం కొత్తపేట గ్రామంలోని అశోక్ రెడ్డి, సాంబశివరావు రైతులకు సంబంధించిన వరి పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు వివరాలు సరిగ్గా లేకపోతే పంట విక్రయ సమయంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయన్నారు. ఏవో రాజు, ఏఈవోలు నాగరాజు, అఖిల్ రైతులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదానం : కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణ దాత లుగా నిలవాలని యువతకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. పోలీసు ల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లును కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఏసీపీ పండరి చేతన్ నితిన్, సీఐ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



వివేకానంద సెంటర్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ కేంద్ర హోంమంత్రి దివంగత సర్దార్ వల్ల భాయ్‌పటేల్ జయంతిని నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వివేకానంద సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రన్‌ఫర్ యూనిట్ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు మాట్లాడారు. బ్రిటీష్ ప్రభుత్వం వేధించిన పన్నులకు వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమం చేపట్టి, దేశంలోని ప్రజలను ఆకర్షించిన మహోన్నత వ్యక్తి వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, గడ్డం అశోక్, మదన్‌నాయక్, పూర్ణచందర్‌రెడ్డి, దారా ఇందు భారతి, ఓర్సు పద్మావతి, జహేందర్‌నాయక్, రాజు, గణేష్, భరత్, కిషన్, రామకృష్ణ, సతీష్, సుధాకర్, సందీప్ పాల్గొన్నారు.